సాక్షి అనంతపురం

ఆదివారం । 2 । జూలై । 2023



చీనీ టన్ను రూ.23వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23వేలు పలికాయి.



ఉపాధి సూపర్

జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద నార్పలలో నిర్వహిస్తున్న మహిళా మార్ట్ ప్రైవేట్ సూపర్ మార్కెట్లకు దీటుగా పోటీ ఇస్తోంది. 8లో

గరిష్టం/కనిష్టం
36.2°/23.4°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి ఆకాశం పాక్షికం గా మేఘావృతమైంది. వాతావరణం చల్లబడింది.

న్యూస్‌రీల్

పథకాలు సద్వినియోగం చేసుకోండి



గోధుమపిండి పంపిణీ చేస్తున్న జేసీ కేతన్‌గార్గ్, చిత్రంలో డీఎస్‌ఓ శోభారాణి

అనంతపురం అర్బన్: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ప్రజలకు సూచించారు. కార్డుదారులకు ఈ నెల నుంచి గోధుమ పిండి పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పౌర సరఫరాల శాఖ శనివారం నగరంలోని అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జేసీ హాజరై కార్డుదారులకు గోధుమ పిండి, ఇతర సరుకులు అందజేశారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందన్నారు. పౌష్టికమైన ఫోర్టిఫైడ్ బియ్యం ఉచితంగా ఇస్తోందన్నారు. అదే విధంగా రాగులు, జొన్నలు ఉచితంగా అందిస్తోందన్నారు. ఈ నెల నుంచి మునిసిపాలిటీల పరిధిలో గోధుమ పిండి కిలో రూ.16తో అందిస్తోందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ శోభారాణి, సీఎస్‌డీటీలు పాల్గొన్నారు.

ఇసుక సక్రమంగా సరఫరా చేయాలి

అనంతపురం అర్బన్: జిల్లాలో ఇసుక సరఫరా సక్రమంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. ఇసుకు సరఫరా అంశంపై జేసీ శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలైన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి, నాడు–నేడు పనులకు ఇసుక సరఫరాలో జాప్యం జరగకూడదన్నారు. వర్షాల నేపథ్యంలో ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఇసుకను డంప్ చేసుకోవాలని సూచించారు. అవసరం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నూతన ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా నిఘా పెంచాలని సూచించారు.

సాహస అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: టెన్సింగ్ నార్గే జాతీయ సాహస అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు తెలిపారు. 2020, 2021, 2022 సంవత్సరాలలో భూమి, నీరు, గాలి వంటి వాటిపై చేసిన సాహస కార్యకలాపాల్లో విజయాలు సాధించిన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాహస క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించే వ్యక్తులకు జీవిత కాల సాఫల్యం కింద అవార్డుతో పాటు రూ.1.50 లక్షల నగదును రాష్ట్రపతి చేతుల మీదుగా అందిస్తారన్నారు. వచ్చేనెల 14లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు https://awards.gov.in ను సంప్రదించాలని సూచించారు.

తెలవారగానే మురి'పింఛన్'



అనంతపురం 50వ డివిజన్‌లో లక్ష్మీదేవికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ వెంకటేశులు

అనంతపురం: వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారుల మోములో సంతోషం నింపింది. జూలై నెల పింఛన్ శనివారం తెల్లవారుజామునుంచే ప్రారంభమైంది. వలంటీర్లు వృద్ధులు, దివ్యాంగులు, చేతివృత్తిదారులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తదితర లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేశారు. జిల్లాలో మొత్తం 2,73,496 మందికి గాను తొలిరోజే 2,46,887 మందికి (90.27 శాతం) పింఛన్ బట్వాడా పూర్తయ్యింది. మొత్తం రూ.76.41 కోట్లు పింఛన్ పంపిణీ లక్ష్యం కాగా, రూ.68.92 కోట్లు పంపిణీ చేశారు.

అర్హుల చెంతకే సేవలు

- 'జగనన్న సురక్ష' క్యాంప్‌లకు తొలిరోజు విశేష స్పందన





రాయదుర్గంలో విప్ కాపు రామచంద్రారెడ్డి, గుంతకల్లులో ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి నుంచి సర్టిఫికెట్లు అందుకుంటున్న లబ్ధిదారులు

అనంతపురం సిటీ/క్రైం : జగన్ సర్కారు అర్హుల చెంతకే ప్రభుత్వ సేవలందిస్తోంది. అర్హత ఉన్నా ధ్రువీకరణ పత్రాలు లేక సంక్షేమ పథకాలు అందని వారిని సైతం గుర్తించి, వారికి ఆ డాక్యుమెంట్లు మంజూరు చేయించి మరీ లబ్ధి చేకూరుస్తోంది. 11 రకాల సర్టిఫికెట్లు–సేవలను ఉచితంగా అందించే 'జగనన్న సురక్ష' క్యాంపులు జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లాస్థాయి కార్యక్రమాన్ని బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో కలెక్టర్ గౌతమి ప్రారంభించారు. ఈ నెల 24 వరకు నిర్ణీత తేదీల్లో సచివాలయాలు/క్లస్టర్ల వారీగా క్యాంపులు నిర్వహిస్తారు. తొలిరోజు 67 సచివాలయాల పరిధిలో నిర్వహించిన క్యాంపులకు విశేష స్పందన లభించింది. 9,585 వినతులు రాగా, అక్కడికక్కడే 4,741 వినతులు పరిష్కరించి జిల్లా యంత్రాంగం రికార్డు సృష్టించింది.

- రాయదుర్గంలోని పాత మీ–సేవ కేంద్రం వద్ద 2, 7 సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పలు రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందించారు.
- అనంతపురం కోర్టురోడ్డు 26వ సచివాలయం, క్లాక్‌టవర్ 22, ఎంజీ కాలనీలోని రెండో సచివాలయంలో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. 26వ సచివాలయంలో జరిగిన క్యాంపును మేయర్ వసీం, జేసీ కేతన్‌గార్గ్‌తో కలిసి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రారంభించారు.
- గుంతకల్లులోని 25వ వార్డులో శనివారం జరిగిన 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హాజరై లబ్ధిదారులకు పలు ధ్రువపత్రాలు అందజేశారు. కసాపురం, నెలగొండ గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర హాజరయ్యారు.
- తాడిపత్రి మండలం భోగసముద్రం–1, ఆలూరు సచివాలయాల్లో జరిగిన కార్యక్రమాలకు అనంతపురం ఆర్డీఓ మధుసూదన్ హాజరయ్యారు.
- కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి సచివాలయంలో ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తిలో మండల నోడల్ ఆఫీసర్, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో సర్టిఫికెట్లు అందజేశారు.
- రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన జగనన్న సురక్ష క్యాంప్‌ను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. ఆత్మకూరు మండలం బి.యాలేరు, చెన్నేకొత్తపల్లి మండలం కనుముక్కలలో జరిగిన క్యాంపులోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు. వలంటీర్ల ద్వారా స్వీకరించిన అర్జీలను పరిశీలించి అధికారులు సర్టిఫికెట్లు మంజూరు చేయగా.. వాటిని ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులు అందుకున్నారు.

తొలిరోజు క్యాంపులో..

అంశం	వినతులు	పరిష్కారం
ఆధార్	1,429	520
సివిల్ సప్లయిస్	113	69
బియ్యం కార్డుల్లో సభ్యుల తొలగింపులు	5	2
కొత్తగా బియ్యం కార్డు	36	21
బియ్యం కార్డులో మార్పులు చేర్పులు	28	14
మ్యాపింగ్	50	23
ఆరోగ్యశ్రీ కార్డు కోసం	4	1
మ్యారేజ్ సర్టిఫికెట్లు	1	1
అడంగల్ నమోదు	37	37
ఫ్యామిలీ సర్టిఫికెట్	15	11
ఇన్‌కం సర్టిఫికెట్లు	3,715	2,173
ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు	3,916	2,267
మ్యుటేషన్ టైటిల్ డీడ్	9	7
పొజిషన్ సర్టిఫికెట్లు	2	2



రాప్తాడులో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



అనంతపురంలో వివిధ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

ప్రభుత్వ మేలును మరువలేం



ప్రభుత్వ పథకాల కోసం అవసరమైన కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా దరఖాస్తు చేసుకున్నా. అధికారులు పరిశీలించి, అప్పటికప్పుడే అందజేశారు. చాలా సంతోషంగా ఉంది. వితంతు పింఛన్, చేయూత ద్వారా వస్తున్న డబ్బులతో జీవిస్తున్నాను. ప్రభుత్వం చేస్తున్న మేలును మరువలేం.

–గౌసియా, గుల్జార్‌పేట, అనంతపురం

ఇంటి వద్దకే సేవలు



'జగనన్న సురక్ష' క్యాంపులో కుల ధ్రువీకరణపత్రాన్ని మంజూరు చేశారు. రజక వృత్తి చేసుకుని జీవనం సాగించే మాకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ఊపిరిపోస్తున్నాయి. సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి అన్ని సేవలూ అందిస్తున్నారు. నిజంగా ఇటువంటి సదుపాయాలను గతంలో మేము చూడలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– భాగ్యమ్మ, ఆదిమూర్తినగర్, అనంతపురం

ఉచితం.. సంతోషం



నేను బుక్కరాయసముద్రంలోని హైస్కూల్ కొట్టాలలో రజక వృత్తి చేసుకుంటున్నాను. నా కొడుకు సునీల్ చరణ్ ఇంటర్ చదువుతున్నాడు. కుమార్తె 9వ తరగతి చదువుతోంది. వీరికి కులం, ఆదాయం సర్టిఫికెట్లు కావాల్సి ఉండగా 'జగనన్న సురక్ష' క్యాంపులో దరఖాస్తు చేసుకోగానే అధికారులు మంజూరు చేశారు. ఉచితంగా సర్టిఫికెట్లు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉంది.

– సుధాకర్, బుక్కరాయసముద్రం

'జగనన్న సురక్ష' పేదలకు వరం



అర్హులకు సర్టిఫికెట్లు అందిస్తున్న కలెక్టర్ గౌతమి

బుక్కరాయసముద్రం: 'జగనన్న సురక్ష' కార్యక్రమం పేదలకు వరమని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. శనివారం బుక్కరాయసముద్రం సచివాలయంలో సర్పంచ్ పార్వతి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రవేశ పెట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సచివాలయాల్లో 11 రకాల సర్టిఫికెట్లు, సేవలు ఉచితంగా అందిస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా జగనన్న సురక్ష క్యాంపులు ఈ నెల 1 నుంచి 24 వరకు అన్ని సచివాలయాల్లో నిర్వహిస్తారన్నారు. ప్రజలకు అవసరమయ్యే కుల, ఆదాయ, జనన సర్టిఫికెట్లు, ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం, రైస్ కార్డులో సభ్యుల నమోదు వంటి సేవలు ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ విజయభాస్కర్, ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, డీటీ ప్రతాప్‌రెడ్డి, ఉప సర్పంచ్ వరలక్ష్మి, ఎంపీటీసీ కాలువ వెంకటలక్ష్మి, ఈఓఆర్‌డీ దామోదరమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్ పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటా



ఇదివరకు కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగేవాళ్లం. వారం నుంచి రెండు వారాల సమయం పట్టేది. పరపతి ఉన్నోళ్లకు కార్యాలయాల్లో పనులు జరిగేవి. ఇప్పుడు జగనన్న ప్రభుత్వంలో అలాంటి సమస్య లేదు. దరఖాస్తు చేసుకున్న వెంటనే ఎవరి ప్రమేయం లేకుండా సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నారు. ఇలాంటి సేవలందిస్తున్న జగనన్నకు రుణ పడి ఉంటాం.

– రేణుక, బుక్కరాయసముద్రం

సీఎం పర్యటన విజయవంతం చేయండి

- మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపు
- కళ్యాణదుర్గం నుంచి బీమా నిధుల విడుదల



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, కలెక్టర్ గౌతమి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు.

కళ్యాణదుర్గం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతుల పక్షపాతి అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్ అన్నారు. వ్యవసాయానికి పెద్దపీట వేసి అన్నదాతలకు అడుగడుగునా అండగా నిలుస్తున్నారని అన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఈ నెల ఎనిమిదో తేదీన సీఎం కళ్యాణదుర్గం వస్తున్నారని, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. శనివారం ముఖ్యమంత్రి కార్యక్రమాల కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, కలెక్టర్ గౌతమి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, డీఎస్పీ బి.శ్రీనివాసులుతో కలిసి మంత్రి కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో సీఎం పర్యటనపై సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ ఖరీఫ్–2022కు సంబంధించి వాతావరణ బీమా, ఫసల్ బీమా కింద రాష్ట్రంలోని రైతులను ఆదుకునేందుకు రూ.1,016 కోట్లు విడుదల చేసేందుకు సీఎం కళ్యాణదుర్గం వస్తున్నారన్నారు. ఇందులో జిల్లాకు రూ.211.80 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

సీఎం పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. ఏర్పాట్లలో పొరపాట్లకు తావివ్వకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని సూచించారు. సందేహాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ అప్పగించిన పనులను బాధ్యతగా పూర్తి చేయాలన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం పర్యటన సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సభా స్థలి, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలు వంటి వాటిపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చిస్తామన్నారు. సమీక్షలో జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఓబుళ్‌రెడ్డి, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

సీఎం పర్యటన సందర్భంగా బహిరంగ సభ కోసం కళ్యాణదుర్గంలోని ఏపీ మోడల్ స్కూల్ ఎదురుగానున్న ఖాళీ స్థలాన్ని మంత్రి, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్, కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. సభకు వచ్చే వాహనాలు నలువైపులా సమీప ప్రాంతంలో పార్కింగ్ ఉండేలా ప్రధాన రహదారుల పక్కనే ఖాళీ స్థలాలను అన్వేషించారు. అనంతరం హెలిప్యాడ్ కోసం పలు ప్రదేశాలు పరిశీలించారు. సభా ప్రాంగణం వరకు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సీఎం కాన్వాయ్ రోడ్డు మార్గాన వెళ్లేందుకు వీలుగా పలు రూట్లను పరిశీలన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, ఎంపీపీ మారుతమ్మ, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు అర్చన, అంజనేయులు, పెరుగు తిమ్మరాజు, గంగాధర్, రాము, చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, పార్టీ పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృత్యువాత


కానిస్టేబుల్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనారోగ్యంతో ఏఆర్ కానిస్టేబుల్ ఎం.భాస్కరరెడ్డి (52) మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని శనివారం అనంతపురం క్వార్టర్స్‌లో సందర్శనార్థం ఉంచారు. ఎస్పీ కె. శ్రీనివాసరావుతో పాటు అదనపు ఎస్పీ విజయభాస్కరరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ఆదేశించారు. నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం గోవిందుపల్లికి చెందిన భాస్కరరెడ్డి 1990లో పోలీసుశాఖలో అడుగుపెట్టారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అంత్యక్రియలు స్వగ్రామంలో నిర్వహిస్తున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్, తేజ్‌పాల్ తదితరులున్నారు.

సీడీసీ డీన్ బాధ్యతల స్వీకరణ


డీన్‌కు అభినందనలు తెలుపుతున్న సీడీసీ విభాగం ఉద్యోగులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సీడీసీ (కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) డీన్‌గా ప్రొఫెసర్ కే. రామ్‌గోపాల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, మాజీ రెక్టార్ ప్రొఫెసర్ ఏ.మల్లిఖార్జున రెడ్డి ఆయనకు అభినందనలు తెలిపారు. సీడీసీ విభాగం ఉద్యోగులు, ఫిజిక్స్ పరిశోధన విద్యార్థులు తదితరులు కూడా అభినందనలు తెలియజేశారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని రామ్‌గోపాల్ పేర్కొన్నారు.

ఉపాధి సూపర్

- కార్పొరేట్ సూపర్ మార్కెట్‌లకు దీటుగా మహిళా మార్ట్
- జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా నార్పలలో ఏర్పాటు
- మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక భరోసా
- త్వరలో అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు


నార్పలలోని మహిళా మార్ట్

అనంతపురం: మహిళల ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా మహిళా సంఘాల సభ్యులే యజమానులుగా, వారి భాగస్వామ్యంతో నార్పలలో ఏర్పాటు చేసిన మహిళా చేయూత సూపర్‌మార్ట్ సత్ఫలితాలిస్తోంది. ఈ మార్ట్‌లో నాణ్యమైన నిత్యావసర సరుకులు సరసమైన ధరలకే లభిస్తాయి. డ్వాక్రా సభ్యుల ఉత్పత్తుల మొదలు ప్రముఖ కంపెనీల సరుకులు అందుబాటులో ఉంటాయి. పీఎంజీ, హెచ్‌ఎల్, అమూల్, రిలయన్స్, ఫ్లిఫ్‌కార్ట్ వంటి సంస్థలతో చేసుకున్న ఒప్పందాల కారణంగా అవసరమైన సరుకులను ఆర్డర్ చేసి, తెప్పించుకుని వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నారు. నార్పలలో పైలట్ ప్రాజెక్ట్‌గా నిర్వహిస్తున్న చేయూత మార్ట్ విజయవంతం కావడంతో మరి కొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

6 నెలల్లో రూ.10 లక్షల లాభం

నార్పలలో మొత్తం 8,821 మంది మహిళా సంఘాల సభ్యులున్నారు. వీరిలో ఒక్కొక్కరు చెల్లించిన రూ.10 సభ్యత్వంతో రూ.88,210 జమ కాగా, షేర్ క్యాపిటల్ రూ.8,82,100, ట్రేడ్ డిపాజిట్ రూ.26,46,300 కలిపి మొత్తం రూ.36,16,610తో మార్ట్‌ను ప్రారంభించారు. బయటి సూపర్ మార్కెట్‌ల కంటే 5 శాతం తక్కువ ధరకే సరుకుల విక్రయాలు సాగిస్తున్నారు. 2022 నవంబర్ నుంచి 2023 మే వరకూ నెలకు రూ.77,07,712 చొప్పున వ్యాపారం జరిగ్గా, ఆరు నెలల వ్యవధిలో దాదాపు రూ.10 లక్షల లాభం వచ్చింది.

నిర్వహణ ఇలా...

మహిళా మార్ట్‌లను సహకార సొసైటీ కింద ఏర్పాటు చేసి నిర్వహిస్తారు. మార్ట్ ఏర్పాటు చేసే ప్రాంతాల్లోని సంఘాల్లో ఎంత మంది సభ్యులు ఉంటారో అందులో నుంచి 10 మంది ఉత్సాహవంతులైన సభ్యులను బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఎన్నుకుంటారు. వీరి ఆధ్వర్యంలో మార్ట్ నిర్వహణ కొనసాగుతుంది. ఏడాదిలో ఒకసారి (మార్ట్ ప్రారంభించిన 12 నెలల తర్వాత) లాభాలను సంఘం సభ్యులకు పంచుతారు.

ఆదరణ పెరిగింది



మహిళా మార్ట్ ద్వారా నాణ్యమైన సరుకులు అతి తక్కువ ధరకే అందిస్తున్నాం. ఇతర సూపర్ మార్కెట్‌లతో పోల్చుకుంటే ఇక్కడ ధర తక్కువ. దీంతో మార్ట్ ఏర్పాటు చేసిన తక్కువ కాలంలోనే ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. రాబోవు రోజుల్లో మరింత విస్తరించగలమనే నమ్మకం ఏర్పడింది. మహిళల ఆర్థిక బలోపేతానికి చర్యలు తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.
– రేఖ, నార్పల మండల సమాఖ్య అధ్యక్షురాలు

లాభాలు వారికే..



స్వయం సహాయక సంఘాల సభ్యులను వ్యాపారవేత్తలుగా చేయాలన్నదే లక్ష్యం. ఇందులో భాగంగానే ఆయా సంఘాల సభ్యుల భాగస్వామ్యంతో మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో వచ్చే లాభాలు వారికే దక్కేలా చర్యలు తీసుకుంటున్నాం.
– ఐ.నరసింహారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

సంఘాల ఉత్పత్తులూ విక్రయం



బడా కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని మహిళల జీవనోపాధుల మెరుగుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారు. మహిళా మార్ట్, రిటైల్ స్టోర్లు ఏర్పాటు చేయిస్తున్నారు. కల్తీలేని, నాణ్యమైన సరుకులు తక్కువ ధరకే వినియోగదారులకు మార్ట్‌లో అందుబాటులో ఉంచాం. స్థానిక స్వయం సంఘాల ఉత్పత్తులను సైతం విక్రయించే వెసులుబాటు కల్పించాం.
– ఎం.కె.సత్యనారాయణ, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్

ముమ్మరంగా ఎల్‌సీడీ సర్వే

- కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఇంటింటికీ వైద్య సిబ్బంది
- 5,15,182 ఇళ్లను జల్లెడ పట్టనున్న బృందాలు

అనంతపురం క్రైం/తాడిపత్రి: కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీ)కు శ్రీకారం చుట్టాయి. అందులో భాగంగా గత నెల 26న ప్రారంభమైన సర్వే జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. గ్రామాల్లో ఆశా, వలంటీర్‌తో ఏర్పాటు చేసిన బృందం ఈ నెల 26 వరకూ 5,15,182 (రూరల్- 3,76,978, అర్బన్-1,38,204) ఇళ్లను జల్లెడ పట్టనున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 45 పీహెచ్‌సీలు, 26 అర్బన్ సెంటర్లలో సర్వే సాగుతోంది. 23,31,460 (రూరల్‌లో 16,83,861, అర్బన్‌లో 6,47,599) మందిని మౌఖికంగా లేదా ప్రత్యక్షంగా పరిశీలించేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు. రూరల్‌లోని 475, అర్బన్‌లో 180 సచివాలయాల పరిధిలో ఆశా, వలంటీర్లు సర్వే చేయనున్నారు. సర్వే కోసం జిల్లాలో 1,618 బృందాలు ఏర్పాటు చేశారు. వలంటీర్లు లేని పక్షంలో అందుబాటులో ఉన్న వ్యక్తులతో సర్వే చేస్తున్నారు. మహిళలను ఆశా కార్యకర్తలే పరిశీలించేలా ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంది. కాగా, ఈ ఏడాది మార్చి వరకూ జిల్లాలో 210 మంది కుష్టు వ్యాధిగ్రస్తులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది. వారికి వైద్య చికిత్స ప్రారంభించగా, 45 మంది కోలుకున్నారు.

సర్వే పరిశీలన..

లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ సర్వేను లెప్రసీ,ఎయిడ్స్, టీబీ విభాగం రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఎస్‌డీ సాగర్ శనివారం తనిఖీ చేశారు. బీకేఎస్, తాడిప్రతి, తదితర ప్రాంతాల్లో సర్వేను ఆయన పరిశీలించారు. ఆదివారం కళ్యాణదుర్గంలో సర్వేను పరిశీలించనున్నట్లు తెలిసింది.


పుట్లూరులో కుష్టు వ్యాధి సర్వేను పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌డీ సాగర్

సర్వే విజయవంతం చేయండి

కుష్టు వ్యాధి సర్వేను విజయవంతం చేయాలని లెప్రసీ,ఎయిడ్స్,టీబీ విభాగం రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఎస్‌డీ సాగర్ పిలుపునిచ్చారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు తీసుకున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మందులు, పరికరాల నిల్వలపై ఆరా తీశారు. స్టాఫ్ పాయింట్‌లో మందులు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎల్‌ఏడీ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. కుష్టు వ్యాధి సర్వే విజయవంతానికి సూచనలు, సలహాలనందజేశారు.

ప్రారంభదశలో గుర్తించడమే లక్ష్యం

కుష్టు వ్యాధిని ప్రారంభదశలో గుర్తించడమే లక్ష్యంగా సర్వేను ముమ్మరం చేశాం. మొదట్లోనే సమస్యను గుర్తించి వైద్యమందిస్తే నివారించవచ్చు. 6 నుంచి 12 నెలలు మందులు తీసుకుంటే నయమవుతుంది. సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.
– డాక్టర్ యుగంధర్, డీఎంహెచ్‌ఓ

పారదర్శకంగా పాస్‌పోర్టు వెరిఫికేషన్

- ఎస్పీ శ్రీనివాసరావు



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పాస్‌పోర్టు మంజూరుకు, ఉద్యోగాలకు సంబంధించి నిర్వహించే పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలన్నారు. ఆయా గ్రామాల స్థితిగతులపై ఆరా తీశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని గుర్తించాలని ఆదేశించారు. ఇసుక, మద్యం, మట్కా, గుట్కా, పేకాటలాంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఈ తరహా కార్యకలాపాలు కొనసాగించేవారి జాబితాను అందజేయాలని సూచించారు. సమీక్షలో స్పెషల్ బ్రాంచ్ సీఐలు ఇందిర, జాకీర్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


గాయాలతో శ్రీనివాసులు

గుంతకల్లు రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన గుంతకల్లు మండలంలోని తిమ్మాపురం గ్రామం వద్ద చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. పాతకొత్త చెరువు గ్రామానికి సుజాత, వాల్మీకప్ప దంపతుల కుమారుడు శ్రీనివాసులు (18) గుంతకల్లు పట్టణంలోని ఎస్కేపీ కళాశాలలో ఒకేషనల్ కోర్సు చదువుతున్నాడు. పాతకొత్త చెరువుకు చెందిన ఆరుగురు స్నేహితులతో కలిసి శనివారం గుంతకల్లులో ఓ పెళ్లికి హాజరయ్యాడు. వేడుక ముగించుకుని ఆటోలో తిరిగి వెళ్తుండగా మండల పరిధిలోని తిమ్మాపురం వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. శ్రీనివాసులు తల, ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. జనార్దన్, ఆటో డ్రైవర్ మహేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసులును వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

14 నుంచి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్


కరపత్రాలు విడుదల చేస్తున్న బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

అనంతపురం: జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జులై 14 నుంచి 16వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షఫీ, అధ్యక్షుడు శ్రీనివాసన్ జాయింట్ సెక్రటరీ పి. ప్రతాప్ తెలిపారు. శనివారం నగరంలోని నాయక్‌నగర్‌లో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు సాంబ, ప్రతాప్, దాదాఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కంబదూరు: మండలంలోని ఎర్రమల్లేపల్లి గ్రామ శివారులో పేకాట కేంద్రంపై కంబదూరు పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ రాజేష్, స్పెషల్ పార్టీ సిబ్బంది శనివారం సంయుక్తంగా దాడులు చేసి 15 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,78,200 నగదు, 15 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు కంబదూరు పోలీసులు తెలిపారు.

కానిస్టేబుల్ కన్నుమూత


కిరణ్ (ఫైల్)

నార్పల: అప్పుల బాధ తాళలేక గత నెల 10న క్రిమిసంహారక మందు తాగిన ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్ శనివారం కన్నుమూశారు. వివరాలు.. మండల కేంద్రంలోని ఉయాలకుంట కాలనీకి చెందిన కిరణ్ (33) ఏఆర్ కానిస్టేబుల్‌గా పుట్టపర్తి జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నారు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్‌లో బెట్టింగ్స్ ఆడుతూ దాదాపు రూ.20 లక్షల దాకా అప్పు చేశారు. అప్పు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురై గత నెల 10న క్రిమిసంహారక మందు తాగారు. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ఓ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం కానిస్టేబుల్ ప్రాణాలు విడిచారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి దుర్మరణం


మృతుడు గోవిందప్ప

పావగడ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణగిరి గ్రామ సమీపంలో జరిగింది. వీర్లగొంది గ్రామానికి చెందిన గోవిందప్ప (33) ద్విచక్ర వాహనంలో గ్రామం నుంచి కృష్ణగిరి వైపు వెళ్తుండగా సమీపంలోని గేటు వద్ద ఎదురుగా వేగంగా వచ్చిన బొలెరో ఢీ కొంది. దీంతో గోవిందప్ప తలకు తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే ప్రాణాలు వదిలాడు.

తుస్సుమన్న బస్సుయాత్ర!


జనం లేక వెలవెలబోతున్న టీడీపీ రచ్చబండ


అనంతపురం శ్రీకంఠంసర్కిల్: 'భవిష్యత్‌కు గ్యారెంటీ' పేరుతో టీడీపీ చేపట్టిన బస్సుయాత్ర జిల్లాలో తుస్సుమంటూనే ఉంది. జిల్లా కేంద్రం అనంతపురంలో పరిస్థితి మరీ దారుణంగా కనిపించింది. శనివారం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకరచౌదరి ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్రలో పట్టుమని పది మంది కూడా ఆయన పక్కన నిలబడలేదు. రాజీవ్ కాలనీలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమం జనం లేక వెలవెలబోయింది. కొందరు టీడీపీ కార్యకర్తలు తప్ప కాలనీ వాసులు ఎవరూ రాలేదు. దీంతో చాలా సేపు ప్రజల కోసం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఎదురు చూశారు. మాజీ ఎంపీ కాల్వ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు చాలా సేపు చెట్టు నీడన కూర్చుండిపోయారు. చివరికి ఉన్నవారితోనే మమ అనిపించి బస్సుయాత్ర ముగించారు. కాగా, ఒకప్పుడు మాజీ ఎమ్మెల్యే 'వైకుంఠం' దత్తతకు తీసుకున్న రాజీవ్‌కాలనీలో కూడా ఒక్కరంటే ఒక్కరు కూడా ఆయన్ని ఆప్యాయంగా పలకరించిన పాపాన పోలేదు. పైగా నాటికి, నేటికీ కాలనీ ఎంత అభివృద్ధి చెందిందో స్వయంగా మీరే చూడమంటూ కొందరు పరోక్షంగా విన్నవించడం కనిపించింది.

ఉర్దూ కళాశాలను అందుబాటులోకి తెస్తాం

- ఎమ్మెల్యే వైవీఆర్, ఎంపీ రంగయ్య

గుంతకల్లు: ప్రభుత్వ ఉర్దూ కళాశాల, హాస్టల్‌ను వినియోగంలోకి తీసుకొస్తామని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, ఎంపీ తలారి రంగయ్య తెలిపారు. పట్టణంలో భాగ్యనగర్‌లోని మైనార్టీ ప్రభుత్వ మైనార్టీ కళాశాల, హాస్టల్ భవనాలను శనివారం ఎంపీ, ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవనాలను 8 ఏళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించారని గుర్తు చేశారు. లెక్చరర్లు, సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగంగా మారాయన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న కళాశాలను అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసిందన్నారు. భవనాలను వేరే కార్యాలయాలకు ఉపయోగిస్తారని కొంత మంది సృష్టించిన పుకార్లను నమ్మరాదన్నారు. మైనార్టీలకు సంబంధించిన కార్యకలాపాలకే వాడుతామని స్పష్టం చేశారు. కలెక్టర్, సంబంధిత శాఖ మంత్రులు దృష్టికి తీసుకెళ్లి, వచ్చే విద్యాసంవత్సరంలోపు బోధన సిబ్బంది, స్టాఫ్ ఏర్పాటు చేస్తామన్నారు. లేకుంటే ఉర్దూ హైస్కూల్‌ను అందులోకి మారుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్.రామలింగప్ప, అరబిక్ స్కూల్ కమిటీ చైర్మన్ ఇంతియాజ్, హాజ్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు అహమ్మద్‌బాషా, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ జింకల రామాంజనేయులు, కౌన్సిలర్ చాంద్‌బాషా, మైనార్టీ నాయకులు నూర్‌నిజామి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీ ప్రారంభం


క్రికెట్ ఆడుతున్న దృశ్యం

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ (త్రీడే మ్యాచ్) అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ శనివారం ఆర్డీటీ క్రీడా గ్రామంలో ప్రారంభమైంది. అనంతపురం, చిత్తూరు జట్ల మ్యాచ్‌లో టాస్ గెలిచి చిత్తూరు జట్టు బ్యాటింగ్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 43.3 ఓవర్లకు 183 పరుగులకు ఆలౌట్ అయింది. జీఆర్ జ్ఞానేశ్వర్ (37 పరుగులు), ఏ. సూర్య (29), దీపక్ సాహిత్ (34) రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 38 ఓవర్లలో 177 పరుగులకు నాలుగు వికెట్లు నష్టపోయింది. బీఎస్ వినయ్ కుమార్ 44, ఎంకే దత్తా రెడ్డి 70 (నాటౌట్) రాణించారు.

- కడప, నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్‌లో నెల్లూరు మొదట బ్యాటింగ్ చేసింది. 65.1 ఓవర్లలో 304 పరుగులు చేసి ఆలౌట్ అయింది. సాకేత్ రామ్ 49 బంతుల్లో 88 పరుగులు (ఆరు ఫోర్లు, 9 సిక్సులు) ధాటిగా ఆడడంతో భారీ స్కోరు నమోదైంది. అనంతరం బ్యాటింగ్ చేసిన కడప జట్టు 22 ఓవర్లలో 116 పరుగులు చేసి ఒక వికెట్ కోల్పోయింది. టి. వంశీ కృష్ణ 71 పరుగులు నాటౌట్ (74 బంతుల్లో 12 ఫోర్లు) క్రీజులో ఉన్నారు.

పొట్టేలుపై చిరుత పంజా



కుందుర్పి: పొట్టేలుపై చిరుత పంజా విసిరింది. మండలంలోని మందలపల్లిలో ఈ ఘటన చోటుచేసుకుంది. శనివారం ఉదయం గ్రామానికి చెందిన రైతు పెద్దప్పయ్య తన గొర్రెల మందను వ్యవసాయ తోటలోకి మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి వస్తుండగా పొదలచాటున మాటువేసిన చిరుత ఒక్కసారిగా పొట్టేలుపై దాడి చేసి చంపింది. ఇటీవల రూ. 35 వేలు వెచ్చించి పొట్టేలును కొనుగోలు చేసినట్లు రైతు పెద్దప్పయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. పరిహారం అందజేయాలని అటవీ బీట్ ఆఫీసర్ పరమేశ్వరప్పకు వినతి పత్రం అందజేశాడు.

మంచి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: 'ప్రజలకు మేలు చేయాలన్న తపనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారు.. గత టీడీపీ దోపిడీ పాలన, ప్రస్తుత వైఎస్సార్ సీపీ సుపరిపాలన మధ్య తేడాను ప్రజలు గమనించాలి.. మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వందశాతం సమస్యల పరిష్కార చేయడంలో భాగంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. శనివారం నగరంలోని కోర్టు రోడ్డు 26వ సచివాలయం, క్లాక్‌టవర్ 22, ఎంజీ కాలనీలోని 2వ సచివాలయంలో జగనన్న సురక్ష క్యాంపులు జరిగాయి. 26వ సచివాలయంలో జరిగిన క్యాంపును మేయర్ వసీం, జేసీ కేతన్‌గార్గ్‌లతో కలసి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రారంభించి, లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులను ప్రసన్నం చేసుకుంటేనే పథకాలు వచ్చేవన్నారు.

గత టీడీపీ పాలనలో అభివృద్ధి శూన్యం: గతంలో టీడీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఎమ్మెల్యే అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాలుగేళ్లలోనే నియోజకవర్గంలో రూ.వందల కోట్లతో పెద్ద ఎత్తున బ్రిడ్జిలు, రోడ్లు, కాలువలు, తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే.. ఇది మా ఘనతే అని టీడీపీ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జేసీ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని జూలై నెలలో అన్ని సచివాలయాలు కవరయ్యేలా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

2,797 సర్టిఫికెట్ల అందజేత : 11 రకాల సేవల్లో భాగంగా మొత్తం 2,797 సేవల సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేసినట్లు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. మొత్తం 3,540 సేవల విజ్ఞప్తులు (సర్వీస్ రిక్వెస్టు) వచ్చాయన్నారు. అందులో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు 1,647, ఇన్‌కం 1,562, జనన 6, మ్యారేజ్ 4, ఫ్యామిలీ సభ్యుల సర్టిఫికెట్లు 10, మొబైల్ నంబర్ అప్‌డేషన్ ఆధార్ కార్డు 266, హౌస్ హోల్డ్స్ స్ప్లిట్ 6, రైస్ కార్డు స్ప్లిట్, కొత్త కార్డులు 38లకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, గూడురు మల్లికార్జున, నాగవినూత, ముంతాజ్‌బేగం, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, యువజన జేసీఎస్ కన్వీనర్లు చింతా సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

పాతికేళ్లలో ప్రజలకు చేసిందేమీలేదు

- 'జగనన్న సురక్ష' సభలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: దోచుకోవడం, దాచుకోవడం మీ అలవాటు.. ప్రజలకు ఇచ్చిన మాటను, ఎంతటి కష్టమైనా, నెరవేరుస్తూ వందల సంఖ్యలో ఉచిత బోర్లు వేయించాం.. వేలాదిగా ఇళ్లు నిర్మించాం.. కష్టం వచ్చిన ప్రతి ఒక్కరికీ అండగా నిలబడ్డాం.. మీరు పాతికేళ్లు అధికారంలో ఉన్నా ప్రజలకు చేసిందేమీలేదు.. అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పరిటాల కుటుంబంపై మండిపడ్డారు. శనివారం మండలంలోని బి.యాలేరు గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో కక్షలు రేపుతున్నారు..

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఓర్వలేక పరిటాల కుటుంబం గ్రామాల్లో ప్రజల మధ్య, కులాల మధ్య చిచ్చు పెడుతూ గొడవలు సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. అధికారంలో ఉండగా వంద మందికి పైగా ప్రాణాలు తీసిన పాపం పరిటాల కుటుంబానిదని అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ఎలాంటి గొడవలు, కక్షలు లేకుండా ప్రజలు ప్రశాంత జీవనం సాగిస్తున్నారన్నారు. తాము నియోజకవర్గంలో 17 వేల ఇంటి పట్టాలు, 10 వేలకు పైగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు.

టికెట్ల కోసం పాకులాట..

పరిటాల శ్రీరామ్‌ను ధర్మవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా లోకేష్ ప్రకటించాడని, ఇక సునీతమ్మ పెనుకొండ కావాలని టికెట్ కోసం పాకులాడుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. గతంలో నియోజకవర్గాలు వేరుపడినప్పుడు వారు ఇక్కడికి వచ్చారని, మళ్లీ నియోజకవర్గాలు వేరైతే వాళ్ల ప్రాంతాలకు వెళ్తారని, అలాంటి వారు ఏం అభివృద్ధి చేస్తారని విమర్శించారు. నియోజకవర్గంలో అభివృద్ధే ధ్యేయంగా తోపుదుర్తి కుటుంబం పని చేస్తుందన్నారు. వైఎస్సార్ జయంతి రోజున 'అమ్మ' డెయిరీ పాలు మార్కెట్‌లోకి తెస్తామన్నారు. బి.యాలేరులో జగనన్న సురక్ష కార్యక్రమంలో 114 ఇంటి పట్టాలు అందించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకట శివారెడ్డి, తహసీల్దార్ షర్మిల, ఎంపీడీఓ విజయ్ ప్రసాద్, ఎంపీపీ హేమలత, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ నరసింహారెడ్డి. వైస్ ఎంపీపీ నీలిమ, సర్పంచ్ రేణుకమ్మ, ఎంపీటీసీ లక్ష్మిదేవి, నాయకులు ఈశ్వరరెడ్డి, గంగాధర్‌రెడ్డి, మహేష్, అతికిరెడ్డి, గోపాల్ రెడ్డి, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

'జగనన్న సురక్ష'తో సంక్షేమ పథకాలు

రాప్తాడు: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని, జగనన్న సురక్ష పథకం పేద ప్రజలకు వరమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం రాప్తాడులో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి అధ్యక్షతన జగనన్న సురక్ష క్యాంపులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అవసరమైన ధ్రువపత్రాలు లేక ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు రాలేదని, సంక్షేమ పథకాలు పొందాలంటే అవసరమైన ధ్రువ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. అర్హులందరికీ పథకాలు అందించాలన్న లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ రవికుమార్, మండల ప్రత్యేకాధికారి ఉమామహేశ్వరమ్మ, ఎంపీడీఓ సాల్మన్, తహసీల్దార్ లక్ష్మి నరసింహ, ఏఓ వెంకటేశ్వర ప్రసాద్, హౌసింగ్ ఏఈ దేవరకొండ రామ్మూర్తి, వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మండల యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమం పేదవారికి రక్షగా నిలుస్తుందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కనుముక్కలలో జగనన్న సురక్షను ప్రారంభించారు. అనంతరం 250 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. సర్పంచ్‌సానే రమాదేవి, తహసీల్దార్ షాబుద్దీన్, ఎంపీడీఓ గంగావతి, ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, వైస్ ఎంపీపీ పవన్ కుమార్ రెడ్డి, వెల్దుర్తి, బసంపల్లి సర్పంచ్‌లు జీవిత, నారాయణ స్వామి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామకృష్ణ రెడ్డి, సానే రాజా రెడ్డి, డీటీ అనురాధ, నాయకులు నరసింహారెడ్డి, ఎస్‌టీడీ శీన, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమేష్‌గౌడ్ జన్మదిన వేడుకలు

అనంతపురం క్రైం: నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీనేత అనంత చంద్రరెడ్డి, కార్పొరేటర్ల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం జీజీహెచ్‌లో, మారుతీనగర్‌లోని సురక్ష వృద్ధాశ్రమంలో అన్నదానం, నగరంలోని దీపు రక్తనిధి కేంద్రంలో యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, అధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, సాకే చంద్ర, కమల్‌భూషణ్, శ్రీదేవి, శోభ, డాక్టర్ హరిప్రసాద్, జోగి రాజేంద్ర, సురేంద్ర గౌడ్, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, భారతి, పార్వతి, వాసగిరి నాగ్, బండి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్‌ను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

అభాగ్యులకు 'అమ్మ' ఆసరా


అనాథ అంధ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న అమ్మ రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: అనాథలకు, నిరుపేద అభాగ్యులకు 'అమ్మ' సంస్థ ఆసరాగా నిలిచింది. శనివారం స్థానిక సుభాష్ రోడ్డులోని అనాథ, అంధుల ఆశ్రమంలో చదువుతున్న వారికి స్టడీ మెటీరియల్స్‌తో పాటు సివిల్స్, గ్రూప్స్ చదివే వారికి అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డి కాంపిటేటివ్ బుక్స్ వితరణ చేశారు. అనంతరం 'అమ్మ' సంస్థ రమణారెడ్డి మాట్లాడుతూ పేదరికంతో చదువు ఆగిపోకూడదన్న ఉద్దేశంతో కొందరికి ఫీజులు చెల్లించామన్నారు. వివిధ రకాల పరీక్షల కోసం రూ.50 వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్ అందించినట్లు తెలిపారు.

ఘనంగా మహాలక్ష్మి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న మహాలక్ష్మి శ్రీనివాసులు

అనంతపురం క్రైం: అనంతపురం, హిందూపురం డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు శనివారం శ్రీనగర్ కాలనీలో ఘనంగా జరిగాయి. ముందుగా కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు అందించారు. నాయకులు మహాలక్ష్మి శ్రీనివాస్‌ను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్, నాయకులు అశోక్‌రెడ్డి, వెంకటశివారెడ్డి, మనోజ్, చలపతి, హరీష్‌రెడ్డి, లింగాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రేపు నగరంలో రామానుజ శోభాయాత్ర

అనంతపురం కల్చరల్: జిల్లా అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు భారీగా రామానుజుల శోభాయాత్ర జరగనుంది. స్థానిక మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో ఉదయం 10 గంటలకు శ్రీనివాస కల్యాణోత్సవం జరుగుతుంది. ఆషాఢమాస పౌర్ణమి సందర్భంగా సాగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తబృందాలు, అర్చక ప్రతినిధులు పాల్గొనాలని అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు కోరారు.

మణిపూర్ హింసాకాండను ఆపాలి

అనంతపురం అర్బన్: మణిపూర్ హింసాకాండను తక్షణం ఆపాలని స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఎస్‌ఈయూసీఐ (సీ) ఆధ్వర్యంలో నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఎస్‌ఈయూసీఐ రాష్ట్ర కార్యదర్శి అమర్‌నాథ్ మాట్లాడుతూ మణిపూర్‌లో కొనసాగుతున్న మతపరమైన హత్యలు, విధ్వంసకాండ ఫలితంగా జనజీవనం స్తంభించిందన్నారు. జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు సుబ్రమణ్యం, తబ్రేజ్‌ఖాన్, నాగముత్యాలు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

